సాక్షి నిర్మల్

శుక్రవారం ׀ 20 ׀ డిసెంబర్ ׀ 2024



రోడ్డు పక్కనే వనమేధం

ఖానాపూర్ మండలంలో కలప స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. అక్రమంగా టేకుచెట్లను నరికి తరలించుకుపోతున్నారు.

8లో▸



జాతరకు వేళాయె..

నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి జాతర శని, ఆదివారాల్లో జరుగుతుంది. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.1 /18.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. ఒకటిరెండు చోట్ల చినుకులు పడొచ్చు.

న్యూస్‌రీల్

పాఠశాలల పనివేళలు మార్చాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: జిల్లాలో చలి తీవ్రత దృష్ట్యా పాఠశాలల పనివేళలు మార్చాలని ఎస్టీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. మూడు రోజులుగా చల్ల గాలులు వీస్తున్నందున విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలల పని వేళలు ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు మార్చాలని కోరారు. ఇందులో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్కిడి శ్రీనివాస్‌రెడ్డి, దత్తురాం, శ్రీమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్వర్ణ' ఆయకట్టు రైతుల సమావేశం

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు నుంచి రబీసాగుకు నీటి విడుదల అంశంపై చర్చించేందుకు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయకట్టు రైతులతో మండలకేంద్రంలోని రైతువేదికలో సమావేశం నిర్వహిస్తున్నామని జేఈ మధుపాల్ తెలిపారు. ఈసమావేశానికి ప్రాజెక్టు కుడి, ఎడమ, మధ్య(జౌళీనాలా) కింద పంటలు సాగుచేసే రైతులు హాజరు కావాలని సూచించారు. ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు, రైతుల అభిప్రాయం మేరకు నీటి విడుదలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

జత కుదిరేనా?



మూడు రోజుల క్రితం సఫారీ దారిలో వెళ్తూ కెమెరాకు చిక్కిన ఆడపులి

- ఆడ, మగపులుల దోబూచులాట
- లక్సెట్టిపేట రేంజ్‌లోకి తాజాగా ఆడపులి
- అంతకుముందు ఇక్కడే మగ పులి సంచారం
- ఈ రెండూ కలిస్తే సంతతి పెరిగే అవకాశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తోడు, ఆవాసం వెతుక్కుంటూ వలస పులులు కిలోమీటర్ల కొద్దీ సంచరిస్తున్నాయి. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా పులుల అభయారణ్యాలతోపాటు అభయారణ్యం వెలుపల ఉన్న పెద్దపులులు ఆవాసాలు, తోడు వెతుక్కుంటూ తెలంగాణ వైపు వస్తున్నాయి. యేటా చలికాలంలో ఇక్కడికి తోడు కోసం వస్తూ అడవుల్లో సంచరిస్తూ తిరిగి వెళ్లిపోతున్నాయి. ఈ క్రమంలోనే పత్తిచేలు, సాగు భూములు, రోడ్లు దాటుతూ స్థానికులకు నేరుగా కనిపిస్తున్నాయి. అలా వచ్చిన ఓ పులి కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాంలో ఓ మహిళపై దాడి చేసి చంపేయగా.. సిర్పూర్(టి) పరిధిలో మరొకరిపై దాడి చేసి గాయపర్చింది. ఆ పులి ప్రస్తుతం మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో సంచరిస్తోంది. నిర్మల్ జిల్లా మామడ, సారంగాపూర్ అడవుల్లోనూ ఓ మగ పులి తోడు కోసం వెతికి తిరిగి మహారాష్ట్రకు వెళ్లిపోయింది.

ఈ రెండూ కలిస్తే..

గత నెలలో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట రేంజ్ పరిధిలో ఓ మగపులి ఏసీసీ క్వారీ, మేడారం, అందుగులపేట, బెల్లంపల్లి రేంజ్ కాసిపేట అడవుల్లో సంచరించింది. సిర్పూర్ మీదుగా మహారాష్ట్ర నుంచి వచ్చిన రెండు నుంచి మూడేళ్ల మధ్య ఉన్న మగ పులి(ఎస్12) ఈ ప్రాంతంలో నాలుగైదు రోజులు కలియదిరిగింది. గత నెలలో సంచరించిన ఈ పులి ప్రస్తుతం ఇక్కడి నుంచి వెళ్లిపోయింది. ఉడుంపూర్, ఇందన్‌పల్లి, జన్నారం రేంజ్‌ల్లో సంచరిస్తోంది. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి, జోడేఘాట్ అడవుల్లో సంచరించిన సుమారు మూడేళ్లు ఉన్న ఆడ పులి లక్సెట్టిపేట రేంజ్ క్వారీ, మేడారం అటవీ ప్రాంతంలోకి వచ్చింది. దాదాపు మగ పులి తిరిగిన అదే దారిలో ఆడపులి రావడంతో అధికారులు అప్రమత్తమై ట్రాక్ చేస్తున్నారు. ప్రస్తుతం హాజీపూర్ మండలం ముల్కల అటవీ ప్రాంతంలో ఆ పులి సంచరిస్తోంది. ఈ రెండు పులులు కూడా సమీప ప్రాంతాల గుండానే వెళ్తున్నాయి. ఈ పులి సైతం లక్సెట్టిపేట, జన్నారం వరకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ పులులు జత కలిస్తే కవ్వాల్‌లో పులి సంతతి పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్లుగా కోర్ ఏరియాలోకి పులులు స్థిర నివాసం కోసం చేస్తున్న అధికారుల ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ఉన్నాయి.

భిన్నంగా పరిస్థితులు

కవ్వాల్ కోర్ ఏరియాలో కాకుండా బయటనే సంచరిస్తున్న పులులకు క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మానవ సంచారం అతిపెద్ద ముప్పుగా ఉండడంతోపాటు పత్తి చేలు, పంటలు కాపాడుకునేందుకు వేసే ఉచ్చులు, వన్యప్రాణుల వేటగాళ్లతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో పులి సంచారంపై ఆయా రేంజ్‌ల్లోని అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. తమ పరిధిలో పులి వస్తే నిత్యం అధికారులు ట్రాక్ చేస్తున్నారు. కవ్వాల్ పరిధిలో కోర్‌లో ఇన్నాళ్లు ఒక్క పులి కూడా స్థిర నివాసం ఏర్పాటు చేసుకోలేకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. రేస్ కుక్కల బెడదతోనూ పులులు ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోలేకపోతున్నాయనే వాదనలు ఉన్నాయి. ఇప్పటివరకు చాలా పులులు కవ్వాల్ వరకు వచ్చి వెళ్లిపోయాయి. జే1 అనే మగపులి కొన్నాళ్లు ఉన్నా, తోడు లేక తిరిగి వెళ్లిపోయింది. తాజాగా ఈ రెండు పులులు కలుస్తాయా? లేదా? అనేది వేచి చూస్తున్నారు. ఒకసారి కోర్ ఏరియాలో పులి ఆవాసం ఏర్పాటు చేసుకుంటే పులుల సంతతి పెరుగుతుందని అటవీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గురువులను గుర్తుపట్టేలా..

- పాఠశాలలలో ఉపాధ్యాయుల ఫొటోలు..
- ఏర్పాటు చేయించే పనిలో ప్రధానోపాధ్యాయులు

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా నేడు ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలతోపాటు వారి ఫొటోలను కూడా ఆయా పాఠశాలను ప్రదర్శించాలని ఇటీవలనే రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో అన్ని పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలతోపాటు వారి ఫొటోలను ప్రదర్శించనున్నారు.

గ్రామస్తులు గుర్తుపట్టేలా...

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలల్లో, కేజీబీవీలతోపాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలు, కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లిన సందర్భంగా, గ్రామస్తులు పాఠశాలలను సందర్శించిన సమయంలో అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గుర్తుపట్టేలా ఉపాధ్యాయుల ఫొటోలను ప్రదర్శించాలని విద్యాశాఖ నిర్ణయించింది. చాలా మంది ఉపాధ్యాయులు అనేక రోజుల వరకు పాఠశాలలకు వెళ్లకుండా సమావేశాల పేరిట పాఠశాలలకు వెళ్లకుండా డుమ్మా కొడుతున్నారని, అలాగే కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా విద్యావంతులను వీవీలుగా నియమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివాటికి చెక్ పెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని రూపొందించిందని తెలుస్తోంది. పాఠశాలలకు గ్రామస్తులు



వద్యాల్ ఉన్నత పాఠశాల భవనం

వచ్చిన సందర్భంలో అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎవరో గుర్తుపట్టలేకపోతున్నారు. ఆ సమస్య కూడా పరిష్కరించేలా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలతోపాటు వారి ఫొటోలు ప్రదర్శించనున్నారు.

ఫొటోల సేకరణలో...

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి సూచనలతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఫొటోలను సేకరించే పనిలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొన్ని మండలాలలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను వారి ఫొటోలను ప్రధానోపాధ్యాయులు సేకరించారు. త్వరలోనే వారి ఫొటోలతో కూడిన సమాచారాన్ని ఫ్లెక్సీల రూపంలో పాఠశాలలో ఏర్పాటు చేస్తామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

జిల్లా సమాచారం...

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు	577
ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు	89
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	164
కేజీబీవీ కళాశాలలు	18
మోడల్ స్కూల్	01

ఫొటోలు, వివరాలతో ఫ్లెక్సీలు..



అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలతోపాటు వారి ఫొటోలను సేకరించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఫొటోలు, వివరాలతో ఫ్లెక్సీలు ముద్రించి పాఠశాలల ఆవరణలో ప్రదర్శించాలని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయిస్తాం.

– అశోక్‌వర్మ ఎంఈవో, లక్ష్మణచాంద

'ఇందిరమ్మ' సర్వే పక్కాగా చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని భాగ్యనగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను గురువారం పరిశీలించారు. సర్వేయర్లు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును గమనించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫొటోతోపాటు వారి ఫొటోను, సొంత ఇల్లు అయితే డాక్యుమెంట్లు లేదా ఇంటి పన్ను చెల్లించిన రసీదులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సొంత ఇల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తుదారు చూపిన స్థలం డాక్యుమెంట్ యాప్‌లో పొందుపర్చాలన్నారు.

కొత్త డైట్‌చార్జీల ప్రకారమే మెనూ అందించాలి

ప్రభుత్వ వసతి గృహాల్లో నూతన డైట్ చార్జీల ప్రకారమే కొత్త మెనూ అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెంచిన డైట్ చార్జీల మెనూ లిస్టును ప్రతీ హాస్టల్‌లో ప్రదర్శించాలన్నారు.

పార్కింగ్ సమస్య తలెత్తొద్దు

పట్టణంలోని మార్కెట్ ప్రాంతాలలో పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వీధి వ్యాపారులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే వ్యాపారాన్ని చేసుకోవాలన్నారు. పార్కింగ్ సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, తీర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. షాపింగ్ మాల్, ఇతర వ్యాపార సముదాయాలలో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చేపల మార్కెట్‌ను అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి, డీఈవో రామారావు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, తహసీల్దార్ రాజు, సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

అవార్డులు పనితీరుకు కొలమానం



డీఆర్డీవో, మహిళా సంఘం సభ్యులతో కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: అవార్డులు అధికారుల పనితీరుకు కొలమానమని కలెక్టర్ అభిలాష అభినవ్ అ న్నారు. ఇటీవల జాతీయస్థాయిలో అవార్డులు సాధించిన జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధి కారులు, సిబ్బందిని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో జిల్లా పేరు నిలబెట్టిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. జిల్లాకు రెండు విభా గాల్లో జాతీయ స్థాయి అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. మున్ముందు మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఎం విజయలక్ష్మి, కొండాపూర్ గణపతి స్వయం సహాయక సంఘం సభ్యురాలు నవాత్ లక్ష్మి, నిర్మల్ మండల సమాఖ్య అధ్యక్షురాలు నేరెళ్ల ఉమ, వీవోఏ దానిమెల సుజాత, అడ్డిగ బోసు, ఆర్.సంతోష్‌కుమార్, పి.నర్సయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్లకు 'మైత్రి'

- జనరల్ ఆస్పత్రిలో క్లినిక్ ఏర్పాటు
- సేవలు ప్రారంభించిన అదనపు కలెక్టర్
- ప్రతీ గురువారం వైద్య పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 2న వర్చువల్‌గా మైత్రి క్లినిక్‌ను ప్రారంభించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం ఈ క్లినిక్‌లో సేవలు ప్రారంభించారు. ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేసిన ఈ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతీ గురువారం సేవలు..

జిల్లా జనరల్ ఆస్పత్రిలో ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్‌లో ప్రతీ గురువారం ఓపీ సేవలందించనున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. వైద్యులు రాసి ఇచ్చే మందులను తీసుకునేందుకు సైతం ప్రత్యేకంగా సెంటర్ ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓపీ సేవలు అందిస్తారు.

లక్ష్యాలు..

ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేక వైద్య సేవలు అందించడం, అనారోగ్య సమస్యలతోపాటు లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స అందిస్తారు. ట్రాన్స్ జెండర్లకు ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన కల్పిస్తారు. కౌన్సెలింగ్ చేస్తారు. అవసరమైన వారికి మందులు, ఇతర వైద్య పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారు.

అందించే సేవలు..

- కౌన్సెలింగ్ (ఆరోగ్య/ఆరోగ్యేతర సేవలు)
- లింగ ఆధారిత సేవలు
- సాధారణ ఆరోగ్య సేవలు
- లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స (ఎస్‌టీఐ/ ఆర్‌టీఐ)
- సామాజిక అర్హత సేవలు
- ఇతర క్లినిక్/ల్యాబ్ సమాచారం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గుర్తింపు కార్డులు ఇస్తాం..



ట్రాన్స్ జెండర్లకు సమాజంలో గౌరవం, సమగ్ర వైద్యం అందించడంలో భాగంగా ప్రభుత్వం మైత్రి క్లినిక్స్ ఏర్పాటు చేసింది. క్లినిక్‌లో ప్రత్యేక ఓపీలో డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ సేవలు అందిస్తారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 55 మంది ట్రాన్స్ జెండర్లకు జిల్లా వికలాంగులు వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందిస్తాం.

– ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్

ప్రత్యేక వైద్యం సంతోషకరం..



వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. జ్వరం వచ్చి ఆస్పత్రికి వెళ్లినా వివక్ష చూపుతున్నారు. ప్రభుత్వం ఆలోచించి తమకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం సంతోషంగా ఉంది. మున్ముందు మెరుగైన వైద్య సేవలందించాలని కోరుకుంటున్నాం.

– నైని, ట్రాన్స్‌జెండర్

మెరుగైన సేవలందించాలి

భైంసాటౌన్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్‌ఈ సుదర్శనం సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో భైంసా సబ్ డివిజన్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు డివిజన్ అధికారులు, సిబ్బంది ఆయనను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో విద్యుత్ వినియోగం పెరుగుతుందని, రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. డీటీఆర్, ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఏవో సుదర్శన్, డీఈఈలు హరిచంద్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈలు లక్ష్మణ్‌నాయక్, ఆదిత్య, అన్ని మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ఆత్మ గౌరవ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు అన్ని జిల్లాల ఉద్యమకారులు హాజరవుతారని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, ఎమ్మెల్సీ కోదండరామ్ హాజరవుతారని వివరించారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



కబడ్డీ బాలికల విభాగంలో విజేతగా నిలిచిన భైంసా జట్టు



ఖోఖోలో మొదటి స్థానంలో నిలిచిన ముథోల్ బాలికల జట్టు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ముగిసిన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు
- విజేతలకు అవార్డులు ప్రదానం

నిర్మల్ టౌన్: ప్రతిభ ఉండి.. వెలుగులోకి రాని గ్రామీణ క్రీడాకారులను రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించడమే సీఎం కప్ పోటీల ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నాలుగు రోజులు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలు గురువారం ముగిశాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరై మాట్లాడారు. పోటీల్లో 18 మండలాల నుంచి 1800 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఎంతో మంది గ్రామీణ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యంతో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు అక్కడ కూడా ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తేవాలని సూచించారు. జిల్లా క్రీడాకారుల్లో నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేకంగా కోచ్‌లను నియమిస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పెటా జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు వన్నెల భూమన్న, భోజన్న, అన్నపూర్ణ, శ్రీనివాస్, పరీక్షల నిర్వహణ కమిషనర్ పద్మ, ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

కబడ్డీ బాలురు: మామడ జట్టు మొదటి బహుమతి, తానూరు జట్టు ద్వితీయ బహుమతి

కబడ్డీ బాలికలు: భైంసా జట్టు మొదటి బహుమతి, తానూరు జట్టు ద్వితీయ బహుమతి

ఖోఖో బాలురు: మామడ జట్టు మొదటి బహుమతి, నిర్మల్ రూరల్ జట్టు ద్వితీయ బహుమతి

ఖోఖో బాలికలు : ముథోల్ జట్టు మొదటి బహుమతి, నిర్మల్ రూరల్ జట్టు ద్వితీయ బహుమతి

వాలీబాల్ బాలురు : నిర్మల్ అర్బన్ జట్టు ప్రథమ బహుమతి, ఖానాపూర్ జట్టు ద్వితీయ బహుమతి

వాలీబాల్ బాలికలు : సారంగాపూర్ జట్టు ప్రథమ బహుమతి, సోన్ జట్టు ద్వితీయ బహుమతి

ఫుట్‌బాల్: భైంసా జట్టు మొదటి బహుమతి, ఖానాపూర్ జట్టు ద్వితీయ బహుమతి

బాస్కెట్‌బాల్ బాలురు : నిర్మల్ అర్బన్ జట్టు ప్రథమ బహుమతి, లక్ష్మణచాంద జట్టు ద్వితీయ బహుమతి

బాస్కెట్‌బాల్ బాలికలు నిర్మల్ అర్బన్ ప్రథమ బహుమతి, లక్ష్మణచాంద జట్టు ద్వితీయ బహుమతి.



కబడ్డీలో మొదటి స్థానంలో మామడ జట్టు

పొదుపు, బీమాపై ఆసక్తి కనబర్చాలి

- టీజీబీ రాష్ట్ర చైర్‌పర్సన్ వై.శోభ

దిలావర్‌పూర్: ప్రతీ వ్యక్తి పొదుపు, పెట్టుబడి, బీమాపై ఆసక్తి కనబరిస్తే భవిష్యత్తులో తమ కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్ర చైర్‌పర్సన్ వై.శోభ సూచించారు. దిలావర్‌పూర్‌లో ఇటీవల నిర్మించిన టీజీబీ నూతన భవనాన్ని, బ్యాంకు సేవలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం, సేవలు, వారి ఆర్థిక అవసరాలు తీర్చేందుకే తాము, తమ సిబ్బంది నిరంతరం సేవలు అందిస్తారని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పంట రుణాలు, వివిధ చిన్నతరహా పరిశ్రమలకు, స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున పెట్టుబడుల కోసం రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతీ పొదుపు ఖాతాదారులకు ప్రత్యేకమైన బీమా సౌకర్యాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీజనల్ మేనేజర్ డీవీఎస్.రామారావు మాట్లాడుతూ దిలావర్‌పూర్ మండల కేంద్రంలో అనేక సంవత్సరాలుగా గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయి అజయ్‌కుమార్, బీరవెల్లి టీజీబీ మేనేజర్ శేఖర్, దిలావర్‌పూర్ మేనేజర్ అశోక్, అకౌంటెంట్ మాధురి, క్యాషియర్ నరసింహారావు, భవన యజమాని కట్కం రాజారెడ్డి, సహాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్‌పర్సన్ వై.శోభ

జామకాయలు విక్రయించి నిరసన

నిర్మల్ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె గురువారం పదోరోజుకు చేరింది. సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జామకాయలు విక్రయించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారందరికీ 30 శాతం వెయిటేజ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీరికి సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, జిల్లా పరీక్షల అధికారి సిద్ధ పద్మ సంఘీభావం తెలిపారు. ఇందులో ఉద్యోగులు గంగాధర్, రాజారత్నం, నరేశ్, అర్షద్, తిరుపతి, అనసూయ, విమల, నవిత, రజిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



జామకాయలు విక్రయిస్తూ ఉద్యోగుల నిరసన..

క్లుప్తంగా


పేకాట స్థావరంపై దాడి

కాసిపేట: మండలంలోని కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి వరిపేట శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్న సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న సోమగూడెంకు చెందిన తిరుపతి, బుగ్గగూడెంకు చెందిన నవనందుల వెంకటేష్, తంగళ్లపల్లికి చెందిన అక్కనపల్లి లక్ష్మీపతిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.7,650 స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పత్తిపాక ప్రవీణ్, గుండ్ల సంతోష్, ఎదుల తిరుపతి, గుండా రాజేందర్, సాయి పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆటో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ కాలనీకి చెందిన ఎండీ ఇర్ఫాన్ ఆటో గురువారం ఉదయం 11 గంటలకు చోరీకి గురైంది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇర్ఫాన్ కుమారుడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో రిమ్స్ ఆస్పత్రికి ఆటోలో తీసుకెళ్లాడు. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చే సరికి పార్కింగ్‌లో ఉన్న ఆటో కనిపించలేదు. చుట్టుపక్కలా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రెండిళ్లలో చోరీ



ప్రవీణ్‌కుమార్ ఇంట్లో దొంగలు పగుల కొట్టిన బీరువా

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాకతీయ కాలనీకి చెందిన కొలకాని ప్రవీణ్‌కుమార్, గణేష్‌నగర్‌కు చెందిన కటుకం రవి ఇళ్లలో చోరీ జరిగినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్‌కు, కటుకం రవి శ్రీరాంపూర్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లారని తెలిపారు. ఇరువురి ఇళ్లు తాళాలు వేసి ఉండడంతో దొంగలు ఈ నెల 18న చోరీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రవీణ్‌కుమార్ ఇంట్లో రూ.3.37లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, రవి ఇంట్లో రూ.95 వేల విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అర్లి(టి) @ 5.8 డిగ్రీలు

తాంసి: చలి తీవ్రత జిల్లాలో రోజురోజుకు పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి పడిపోతున్నాయి. చలి తీవ్రతకు ప్రజలు వణికిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల గురువారం కనిష్టంగా 5.8 నుంచి 6 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అర్లి(టి) గ్రామంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం పొగమంచు కమ్ముకోవడంతో పాటు చలిగాలులు వీస్తున్నాయి. ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం అవసరమైతేనే బయటకు వస్తున్నారు. గురువారం జిల్లాలో కనిష్టంగా బేలలో 6.4, పొచ్చెరలో 7.2, జైనథ్‌లో 7.3, మావలలో 7.3, భోరజ్‌లో 7.5, తాంసిలో 7.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దసలి పట్టుతో లాభాలు

- రాష్ట్రానికే తలమానికంగా మంచిర్యాల జిల్లా దసలిపట్టు
- ఈ ఏడాది లక్ష్యాన్ని మించి దిగుబడి
- సాగు చేస్తూ ఉపాధి పొందుతున్న భూమిలేని రైతులు
- త్వరలో దసలి కాయ బహిరంగ వేలం
- వివిధ రాష్ట్రాల నుంచి రానున్న వ్యాపారులు



చెన్నూర్ పట్టు పరిశ్రమ గోదాం వద్ద ఆరబోసిన దసలి పట్టు కాయ



చెట్టుకు కాసిన దసలి పట్టు కాయ

చెన్నూర్: అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే భూమి లేని నిరుపేద రైతులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం దసలి పట్టు పంట సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూమిలేని రైతులు దసలి పట్టు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో దసలి పట్టు సాగు తెలంగాణకే తలమానికంగా మారింది. చెన్నూర్ పట్టు పరిశ్రమ పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి దిగుబడులు వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం 24.10 లక్షల దసలికాయ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటికే పట్టు పరిశ్రమకు సుమారు 26.50 లక్షల దసలికాయ వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

టాప్‌లో మంచిర్యాల జిల్లా..

తెలంగాణ రాష్ట్రంలోని భూపాలపల్లి, భద్రాచలం, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో దసలికాయ పండిస్తున్నారు. దసలికాయ దిగుబడిలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుంది. ఇతర జిల్లాల్లో దసలి కాయ దిగుబడి స్వల్పంగా ఉంటుందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని చెన్నూర్ పట్టు పరిశ్రమ పరిధిలోని దసలి పట్టుకు వివిధ రాష్ట్రాలలో బాగా డిమాండ్ ఉంది.

భూమి లేని రైతులకు ఉపాధి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో భూమి లేని గిరిజన రైతులను గుర్తించిన ప్రభుత్వం దసలి పట్టు కాయను పండించే విధానంపై పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చింది. గత 30ఏళ్లకు పైగా ఈ రెండు జిల్లాలలో సుమారు 1000 మంది రైతులు 7500 ఎకరాల్లో దసలి కాయను పండిస్తున్నారు. కుమురంభీం జిల్లాలో దసలి పంట అంతంత మాత్రంగానే సాగవుతున్నా మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని రాజారాం, కొత్తపల్లి, లింగన్నపేట, నాగంపేట, ఎదుల్లబంధం, చెన్నూర్ మండలంలోని కిష్టంపేట, లింగంపల్లి గ్రామాలలో రైతులు దసలిపంట సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏడాదికి మూడు పంటలు..

దసలి రైతులు ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. దసలి కాయలో ట్రైవోల్టిన్, బైవోల్టిన్ అనే రెండు రకాల కాయలు ఉన్నాయి. బైవొల్టిన్ కాయ వెయ్యికి గత ఏడాది రూ. 4000 నుంచి రూ. 4500 వేలు పలికింది. ట్రైవొల్టిన్ వెయ్యికి రూ. 2500 నుంచి రూ. 3000 పలికింది. ఎక్కువ శాతం మంది రైతులు బైవొల్టిన్ రకం దసలి కాయ పంటనే పండిస్తున్నారు. ఈ ఏడాది ధర పెరిగితే రైతులు మరింత లాభాలు గడించే అవకాశం ఉంది.

రైతుల శ్రమే పెట్టుబడి..

దసలికాయ పండించేందుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదని రైతులు చెబుతున్నారు. రైతులు రూ.2 వేల నుంచి రూ.3 వేల విలువ గల దసలిగుడ్లను కొనుగోలు చేస్తుంటారు. గుడ్ల నుంచి వచ్చే దసలి పురుగులను మద్ది చెట్లపై వేసి 20 నుంచి 30 రోజులపాటు పక్షులు, గద్దల బారిన పడకుండా రక్షించుకుంటే దసలికాయలుగా మారుతాయి. మొత్తంగా 45 రోజుల్లో దసలి కాయ రైతుల చేతికొస్తుంది. ఒక్కో రైతు దాదాపు 25 వేల నుంచి 30 వేల వరకు దసలికాయ పండిస్తారు. దసలికాయ సాగుతో 45 రోజులకు రైతులు సుమారు రూ. 80వేల నుంచి రూ. 90 వేల వరకు ఆర్జిస్తున్నారు.

లక్ష్యాన్ని మించి దిగుబడి..



ఇప్పటికే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి దసలి పట్టు కాయ దిగుబడి వచ్చింది. గత ఏడాది ధర బాగుండడంతో రైతులకు మేలు జరిగింది. ఈ ఏడాది ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. నాణ్యమైన దసలి కాయ చెన్నూర్ పట్టు పరిశ్రమ పరిధిలోనే ఉంది.

– రాథోడ్ పార్వతి, ఏడీ సెరికల్చర్, చెన్నూర్

త్వరలోనే బహిరంగ వేలం..

చెన్నూర్ పట్టు పరిశ్రమ గోదాం వద్ద త్వరలోనే దసలి పట్టు కాయ బహిరంగ వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. బహిరంగ వేలానికి మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల వ్యాపారులతో పాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి వ్యాపారులు వస్తుంటారు.

కోలిండియా వాలీబాల్ పోటీలకు ఎంపిక



వంగ రాములు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి సివిల్ విభాగంలో పని చేస్తున్న సింగరేణి కార్మికుడు కోలిండియా స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యాడు. శ్రీరాంపూర్‌లో గత సెప్టెంబర్ 19, 20వ తేదీల్లో సింగరేణి కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. రాములు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో ఝూర్ఖండ్‌లో ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరిగే కోలిండియా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురువారం జట్టుతో కలిసి ఝూర్ఖండ్‌కు బయల్దేరి వెళ్లాడు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ

మందమర్రిరూరల్: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మందమర్రి మున్సిపాలిటి పరిధిలోని ఊరుమందమర్రిలో గల 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. వినియోగదారులకు డిమాండ్‌ను బట్టి అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సరఫరా చేయడానికి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం



గడ్డిని కింద కూలుస్తున్న డ్రైవర్

లక్సెట్టిపేట(మంచిర్యాల): ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరిగడ్డి దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన సతీష్ మోదెల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వద్ద పశుగ్రాసం కొనుగోలు చేశాడు. గోదావరిరోడ్‌కు చెందిన చంద్రయ్య ట్రాక్టర్‌లో వరిగడ్డి తీసుకువస్తుండగా విద్యుత్ సర్వీస్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు నీళ్ల తీసుకువచ్చి మంటలు ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.పదివేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

- కుటుంబ సభ్యులకు బ్లూకోల్ట్స్ సిబ్బంది కౌన్సెలింగ్



లక్ష్మీనగర్ తండాలో వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసు

లోకేశ్వరం: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని బ్లూకోల్ట్స్ సిబ్బంది చివరి నిమిషంలో కాపాడారు. మండలంలోని లక్ష్మీనగర్ తండాకు చెందిన మూడ్ రాందాస్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగొచ్చి భార్య సుశీలతో గొడవ పడుతున్నాడు. గురువారం కూడా అతిగా మద్యం చేసించి ఇంటికి వచ్చాడు. భార్య మందలించడంతో ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నారు. గమనించిన భార్య వెంటనే డయల్ 100కు కాల్ చేసింది. వెంటనే లోకేశ్వరం పోలీస్ స్టేషన్ నుంచి బ్లూకోల్ట్స్ సిబ్బంది రాజేశ్వర్, రాజ్‌కుమార్ గ్రామానికి చేరుకుని తలుపులు పగులగొట్టి కాపాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భార్యకు రాందాస్‌ను అప్పగించారు. వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బందిని ఎస్సై అశోక్ అభినందించారు.

అత్యాచారయత్నం కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: అత్యాచారయత్నం కేసులో ఒకరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ.. నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన ఓ బాలిక 2021, జూలై 18న తన స్నేహితురాలు ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నర్సయ్య అలియాస్ నరేశ్ ఆ బాలికను తన ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారయత్నం చేశాడు. బాలిక అరవడంతో పక్క ఇంటికి చెందిన అబ్బు ఇంటి తలుపులు పగలగొట్టి నర్సయ్యను పట్టుకునే ప్రయత్నం చేశాడు. దీంతో నర్సయ్య తప్పించుకుని పారిపోయాడు. ఈ విషయంపై ఆ బాలిక తండ్రి కుభీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై మహేశ్ కేసు నమోదు చేసి నర్సయ్యను అరెస్ట్ చేశారు. అనంతరం ఎస్సై ప్రభాకర్‌రెడ్డి చార్జ్‌షీట్ దాఖలు చేసి, కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు చేశారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ నిందితుడు నర్సయ్యకు నాలుగేళ్ల కఠిన కారాగారా శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు.

రోడ్డు పక్కనే వనమేధం

- ఒకేచోట రెండుసార్లు భారీ టేకు చెట్లు నరికిన స్మగ్లర్లు





గురువారం స్మగ్లర్లు నరకడంతో నేలకొరిగిన భారీ టేకు వృక్షాలు



గురువారం స్మగ్లర్ల చేతిలో కోతకు గురైన వృక్షం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్-నిర్మల్ ప్రధాన రహదారి పక్కనే ఖానాపూర్ బీట్ పరిధిలో కలప స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. అక్రమంగా టేకుచెట్లను నరికి తరలించుకుపోతున్నారు. తర్లపాడ్ గ్రామ పొలిమేరలోని నిర్మల్-ఖానాపూర్ ప్రధాన రహదారి పక్కన ఆరు రోజుల క్రితం మూడు భారీ టేకు వృక్షాలను నరికి గుట్టు చప్పుడు కాకుండా ఆరు దుంగలను తరలించారు. అధికారులు గుర్తించి మిగిలిన దుంగలను స్థానిక టింబర్ డిపోకు తరలించారు. తాజాగా అదే ప్రాంతంలో గురువారం వేకువజామున మరో నాలుగు టేకు చెట్లను నరికివేశారు. కలప కోత యంత్రాలతో చెట్లను పడగొట్టి దుంగలు కోశారు. అయితే వాటిని అక్కడే వదిలేసి వెళ్లారు. దుంగలను పరిశీలించిన అధికారులు నరికివేసిన చెట్లకు మార్కింగ్ చేసి స్థానిక డిపోకు తరలించారు. ప్రధాన రహదారి పక్కనే భారీ వృక్షాలను ఒకే చోట నుంచి రెండుసార్లు నరికినా సంబంధిత అధికారులు దృష్టిసారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఇన్‌చార్జి ఎఫ్‌బీవో ముత్యంను వివరణ కోరగా చెట్లు నరికివేసిన సమాచారం తెలియగానే నరికివేసిన చెట్లకు నంబర్ మార్కింగ్ చేసి, అక్కడే ఉన్న దుంగలను టింబర్ డిపోకు తరలించామని తెలిపారు. తాను పాత తర్లపాడ్‌తోపాటు ఇక్బాల్‌పూర్, ఖానాపూర్ బీట్‌లకు ఇన్‌చార్జిగా ఉన్నానని పేర్కొన్నారు. సిబ్బంది కొరత కారణంగా పనిభారం ఎక్కువవుతోందన్నారు. ఈ విషయాన్ని ఎఫ్ఆర్‌వో కిరణ్ దృష్టికి తీసుకెళ్లి తగుచర్యలు చేపట్టామని తెలిపారు.

ముగిసిన నాగోబా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ మూడో వార్షికోత్సవ పూజలను మెస్రం వంశీయులు రెండురోజులపాటు ఘనంగా నిర్వహించారు. గురువారం కుమ్ర దత్త మహరాజ్ ఆధ్వర్యంలో మెస్రం వంశీయులు హోమం జరిపించారు. అనంతరం ఉట్నూర్ మండలం హోల్‌వాడి గ్రామానికి చెందిన విష్ణుమహరాజ్ ఆధ్వర్యంలో ప్రవచనాలు బోధించారు. వార్షికోత్సవ ముగింపు వేడుకలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి మెస్రం వంశీయులు, భక్తులు తరలివచ్చి నాగోబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం కోసేరావ్, మెస్రం బాదిరావ్ పటేల్, మెస్రం చిన్ను పటేల్, దాదారావ్, దుర్గు, నాగ్‌నాథ్, తుకారాం, ఆనంద్‌రావ్, మెస్రం వంశ ఉద్యోగులు మెస్రం సోనేరావ్, దేవ్‌రావ్, శేఖర్‌బాబు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి

ఉట్నూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందింది. స్థానికులు, క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఆరుగురు కూలీలు గురువారం నాగపూర్ గ్రామ సమీపంలోకి పత్తి ఏరేందుకు వెళ్లారు. తిరిగి ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో మార్గం మధ్యలో ఎక్స్ రోడ్డు సమీపంలో వెనుక నుంచి ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బానోతు రేణుక (45) మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అటుగా వెళ్లే ప్రయాణికులు వెంటనే 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు రెఫర్ చేశారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల కొత్త పింఛన్ క్లెయిమ్‌లపై సమీక్ష



వివరిస్తున్న సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్

మందమర్రిరూరల్: స్థానిక జీఎం కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కొత్త పింఛన్ క్లెయిమ్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ సమావేశానికి సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి హాజరయ్యారు. ప్రావిడెంట్ ఫండ్, సీఎంపీఎఫ్ తదితర క్లెయిమ్స్‌పై అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం(ఎఫ్ అండ్ ఏఆర్) వీఎస్ఆర్కే ప్రసాద్, డీవైపీఎం ఆసీఫ్, ఏరియాలోని గనులు డిపార్ట్‌మెంట్ల సంక్షేమాధికారులు, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) మందమర్రి ఏరియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న జట్టు

మంచిర్యాలటౌన్: రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలు మొయినాబాద్‌లో నిర్వహిస్తుండగా, ఉమ్మడి జిల్లా బాలుర క్రికెట్ జట్టు సత్తా చాటుతోంది. తొలిపోరులో కరీంనగర్‌పై విజయంతో ముందుకెళ్లగా, గురువారం జరిగిన మూడో స్టేజీలో కొండాపూర్‌కు చెందిన వరల్డ్ వన్ స్కూల్ జట్టుతో తలపడి 105 పరుగులకే వారిని ఆలౌట్ చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఉమ్మడి జిల్లా జట్టు మూడు వికెట్లను కోల్పోయి విజయం సాధించినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు.

కంపెనీ స్థాయి క్రికెట్ విజేత శ్రీరాంపూర్



శ్రీరాంపూర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 91వ డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ కంపెనీ లెవల్ క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో ఆర్జీ-1 ఆర్జీ-2 జట్టుపై శ్రీరాంపూర్ జట్టు ఒక్క పరుగుతేడాతో విజేతగా నిలిచింది. ఆర్జీ-1, ఆర్జీ-2 జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ ట్రోఫీ, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీరు భీంరావు జాడే, ప్రాజెక్టు ఇంజినీరు వీరన్న, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, భూపాలపల్లి ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, ఎస్ఈ సివిల్ మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆర్కే 7 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ నాయకులు ఎన్నికల్లో కార్మికులకు అనేక హామీ ఇచ్చి గెలిచారని, ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై ఐటీ మాఫీ చేయాలని, మారుపేర్లతో పని చేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలని అన్నారు. కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని గనులపై సంతకాల కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సమ్మయ్య, భగవాన్‌రెడ్డి, అనిల్, రాకేష్, రవీందర్, సత్యనారాయణ, వేణు పాల్గొన్నారు.

నిరసనలో చిన్నారులు



నిరసనలో తల్లులతో చిన్నారులు

తమ డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు పది రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రోజుకో రీతిలో నిరసన తెలుపుతున్నారు. గురువారం జామ పండ్లు అమ్మి నిరసన తెలిపారు. అయితే ఈ నిరసనలో పలువురు ఉద్యోగులు తమ పిల్లలతో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తల్లులతోపాటు పిల్లలు కూడా నిరసనలో భాగమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



రెగ్యులర్ చేయండి అనే ప్లకార్డుతో చిన్నోడు